# 25

# యేసు ప్రార్థన మరియు ఆయన అందజేసిన గొప్ప ఆహ్వానము

## (11:25-30)

ఆయన చేసిన అద్భుతకార్యములను కళ్లారా చూచిన తరువాత కూడ ఆయన ఉపదేశములను తృణీకరించిన పట్టణములపై ఆయన శ్రమలు ప్రకటించిన తరువాత, యేసు బహిరంగముగా, ఒక ప్రార్థన చేసి ఆ తరువాత తన గొప్ప ఆహ్వానమును అందజేసాడు.

### ఆయన తండ్రిని స్తుతించుచున్నాడు (11:25-27)

**25ఆ సమయమున యేసు చెప్పినదేమనగా - తండ్రీ, ఆకాశమునకును భూమికిని ప్రభువా, నీవు జ్ఞానులకును వివేకులకును ఈ సంగతులను మరుగుచేసి పసిబాలురకు బయలుపరచినావని నిన్ను స్తుతించుచున్నాను. 26అవును తండ్రీ, ఈలాగు చేయుట నీ దృష్టికి అనుకూలమాయెను. 27సమస్తమును నా తండ్రిచేత నా కప్పగింపబడి యున్నది. తండ్రిగాక యెవడును కుమారుని ఎరుగడు; కుమారుడు గాకను, కుమారుడెవనికి ఆయనను బయలుపరచ నుద్దేశించునో వాడు గాకను మరి ఎవడును తండ్రిని ఎరుగడు.**

**వచనము 25. ఆ సమయమున** అను పదజాలము ఈ వచనములు వాటికి ముందున్న గ్రంథ పాఠముతో జోడించుచున్నది. ఆయన ఈ స్థలములలో చేసిన అద్భుతకార్యములు మరియు చెప్పిన ఉపదేశములన్నియు ముగిసిన తరువాత - ఇది క్రీస్తు ఈ ప్రాంతమునకు అందజేసిన చివరి ఆహ్వానమై యుండవచ్చును.

యేసు చేసిన ప్రార్థన జనసమూహములకు వినబడవలెనని ఉద్దేశింపబడినది (11:25-27). లూకా ఈ ప్రార్థనను, పరిమితమైనదై యుండిన వారి మహత్కార్యభారము నుండి తిరిగి వచ్చుచుండిన డెబ్బదిమంది అపొస్తలుల గూర్చిన సందర్భములో గ్రంథస్థంచేసాడు (లూకా 10:17, 21, 22).

ఆయన చేసిన ప్రార్థనలోని అంశములేమై యుండినవి? మొదటిగా, ఆయన దేవుని **తండ్రి** అని సంబోధించుచు ఆయనను స్తుతించాడు. ఆయన దేవునితో కలిగియుండిన అసమానమైన సంబంధము మరియు ఆయన తానే దైవమై యుండుట గూర్చిన విషయములపై సావధానము నిలుపబడవలెనని పిలుపునిచ్చుచుండెను (యోహాను 5:18; 10:30 చూడు). రెండవదిగా, ఆయన దేవుని సార్వభౌమాధికారమును నొక్కివక్కాణించుచు, ఆయనను **ఆకాశమునకును భూమికిని** ప్రభువా అని సంబోధించాడు (అపొస్తలుల కార్యములు 17:24 చూడు). మూడవదిగా, రక్షణ దేవుని సమకూర్పే గాని మానవ ప్రణాళికలు, ఉద్దేశములు, లేక శక్తి యొక్క ఫలితము కాదని ఆయన చెప్పాడు. **జ్ఞానులకును మరియు వివేకులకును** మరియు **పసిబాలురకును** మధ్య గల తారతమ్యము వాస్తవమునకు

మేధావికి సంబంధించినది కాదు, కానీ అది వైఖరికి సంబంధించినదై యున్నది; అది తమ సొంత జ్ఞానము, వివేకము, శక్తి మొదలగు వాటిపై ఆధారపడువారికిని దేవుని మీద ఆధారపడువారికిని మధ్య గల భేదమై యున్నది (18:1-4; 21:15, 16; 1 కొరింథీయులకు 1:18-31). "జ్ఞానులు మరియు వివేకులు," వారు తమ్మునుతాము రక్షించుకొనగలరని లేదా వారు రక్షింపబడవలసిన అవసరమే లేదని అనుకొందురు. ఆధ్యాత్మిక అవసరతల నిమిత్తమై దేవుని మీద ఆధారపడువారు "పసిబాలురు" అయియున్నారు. వీరు దేవుని యెదుట తమ్మునుతాము తగ్గించుకొనుచు, "ఆత్మ విషయమై దీనులైనవారై" యున్నారు (5:3).

**వచనము 26**. దేవుడు తన సత్యమును "జ్ఞానులకు" మరుగుజేసి "పసిబాలురకు" బయలుపరచవలెనని ఆయన కలిగియుండిన సార్వభౌమమైన కోరికను ఉద్ఘాటించి చెప్పుట ద్వారా యేసు ఈ క్లుప్త ప్రార్థనను ముగించాడు. **అవును, తండ్రీ, ఈలాగు చేయుట నీ దృష్టికి అనుకూలమాయెను** అని ఆయన పలికాడు. నిజముగా, "దేవుడు అహంకారులను ఎదిరించి, దీనులకు కృప అనుగ్రహించును" (యాకోబు 4:6). ఆయన అహంకారులకు విరోధముగా నిలిచి విరిగినలిగిన హృదయులకు సహాయము చేయుట యందు ఆనందించును (యెషయా 57:15).

యూదులలో అనేకులు, ముఖ్యముగా యూదా నాయకులు, యేసును తృణీకరించారు. ఈ వాస్తవము యేసునకు విరోధమైన గట్టి దెబ్బయై యున్నదని ఎంచబడకూడదు. ఈ తృణీకారము సహితము వాస్తవమునకు దేవుని ప్రణాళికలలోను, సంకల్పములలోను ఒక భాగమై యుండెను. గనుక, ఆయన క్రీస్తు, దేవుని కుమారుడై యున్నాడను గుర్తింపును గూర్చిన సత్యమును అది ఎట్టి విధంగానైనను తగ్గించలేకపోయింది.

**వచనము 27.** ఆయన తన ప్రార్థనను జనసమూహమునకు వివరించుచు, తండ్రి బయలుపరచగోరిన సకల విషయాలను, ఆయన తన కుమారుని ద్వారా బయలుపరచుటకు ఎన్నుకొన్నాడని యేసు సెలవిచ్చెను. "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు; తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరచెను" అనునది ఆ సత్యమై యున్నదని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 1:18).

> యేసు-ఫిలిప్పూ, నేనింతకాలము మీ యొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు గనుక తండ్రిని మాకు కనుపరచుమని యేల చెప్పుచున్నావు? తండ్రియందు నేనును నా యందు తండ్రియు ఉన్నామని నీవు నమ్ముట లేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నా యంతట నేనే చెప్పుటలేదు; తండ్రి నాయందు నివసించుచు తన క్రియలుచేయు చున్నాడు. తండ్రి యందు నేనును నాయందు తండ్రియు ఉన్నామని నమ్ముడి; లేదా యీ క్రియల నిమిత్తమైనను నన్ను నమ్ముడి. (యోహాను 14:9-11).

## ఆయన సమస్త మానవులకు అందజేయుచున్న ఆహ్వానము
## (11:28-30)

**[28]ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. [29]నేను సాత్వికుడను దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును.**

**[30]ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి.**

**వచనము 28.** ప్రార్థన చేసి దాని గూర్చి వివరించిన తదుపరి, ప్రభువైన యేసు ఇచ్చట మాత్రమే పేర్కొనబడియున్న ఒక ఆహ్వానమును అందజేసాడు (11:28–30). లేఖనములలో ఇతర ఆహ్వానములు కూడ ఇవ్వబడి యున్నవి. కానీ యేసు ఉపయోగించిన ఇవే మాటల్లో కాదు. దాని ఒత్తిడి ననుసరించి ఈ ఆహ్వానము అందరికి అన్వయింపదగు సార్వత్రికమైనదై యుండగా, దాని మూల సందర్భములో అది ఎక్కువగా బహు భారమైన ధర్మశాస్త్రము క్రింద ప్రయాసపడుచు మానవ కల్పితమైన వారి సొంత మత సాంప్రదాయముల చేత అణగద్రొక్కబడుచుండిన యూదుల కొరకు ఉద్దేశింపబడునట్లు అగుపించుచున్నది.

యేసు, **నా యొద్దకు రండి** అని పలుకుట ద్వారా, సకల మానవులు విశ్వాసముతోను విధేయతతోను ఆయన వైపు వినయముతో తిరుగవలెనని ఆహ్వానించుచుండెను. మానవులు తండ్రి యొద్దకు ఆయన ద్వారానే రావలసి యున్నది (యోహాను 14:6), గనుక మరొక రక్షణ మార్గము లేదు (యోహాను 6:37, 60–69; అపొస్తలుల కార్యములు 4:12).

ఆయన ఉపదేశములను ఆలకించుచుండిన శ్రోతలలో **అందరు** ఆయన యొద్దకు రావలెనని ఆహ్వానించాడు. తుదకు, ఆయన అందజేయుచున్న ఆహ్వానము "సర్వలోకములోని" "సమస్త జనులకొరకైనదై" (28:19; మార్కు 16:15), రక్షణ ప్రతిపాదన సకల కాలముల యందలి సమస్త జనుల కొరకు ఉద్దేశింపబడినదని సూచించుచున్నది. అది అందరికి ఒకటే ప్రాతిపదిక ప్రకారము అనుగ్రహింపబడును: యూదునికి మరియు అన్యునికి, స్త్రీకి మరియు పురుషునికి, దాసునికి మరియు స్వతంత్రునికి అనుగ్రహింపబడును (రోమీయులకు 1:16; గలతీయులకు 3:26–29). దేవుడు నిర్దేశించిన విధానములో యేసు యొద్దకు వచ్చు ఏ ఒక్కడైనను ఏ మాత్రమును త్రోసివేయబడడు.

యేసు ఆహ్వానము **ప్రయాసపడి భారము మోసికొనుచున్నవారికి** అందజేయబడినది. ఇటువంటి వారు వారి సొంత వనరుల ద్వారా దేవుని సంతోషపరచుటకు ప్రయత్నించుట వలన నీరసించి నిస్సత్తువగలవారయ్యారు. "ప్రయాసపడి" అను పదము అంతర్యములోని నిస్సత్తువను సూచించుచుండగా, "భారము మోసికొనుచున్న" అను పదము బాహ్యా భారములను సూచించుచున్నది. కొందరు వారి సొంత నీతివంతమైన క్రియల చేత రక్షింపబడవలెనని చేయుచుండిన నిరర్థకమైన ప్రయాసముల వలన అధికమైన భారములు మోయుచున్నవారై యుండిరి (తీతు 3:5 చూడు). యేసు, "మోయ శక్యముకాని భారమైన బరువులు కట్టి మనుష్యుల భుజముల మీద వారు పెట్టుదురే, గాని తమ వ్రేలితోనైన వాటిని కదలింపనొల్లరు" అని పరిసయ్యుల గూర్చి సెలవిచ్చాడు (23:4).

ఆయన యొద్దకు వచ్చువారికి ఆయన, **నేను మీకు విశ్రాంతి కలుగజేతును** అని చెప్పాడు. **విశ్రాంతి నిచ్చుట** (*anapausis*) అనగా పనులు చేయుటకు ఎంతో శ్రమించి ప్రయాసపడిన తరువాత లేక ఒక సుదీర్ఘ ప్రయాణము చేసి వచ్చిన తరువాత "తాజాదనము," "నవీకరణము," "నూతన పరచుట," "పునరుద్ధరించుట," లేక "ఉపశమనమును కలుగజేయుటయై" యున్నది. "విశ్రాంతి" అనునది పాత నిబంధనల సర్వసాధారణమైన సంగతై యుండినది. అది దేవుని పిల్లలపై నిలిచియుండు ఒక వాగ్దానముగా క్రొత్త నిబంధనలో బలమైన పట్టుగలదై కూడ ఉన్నది (కీర్తనల 95:7–11; హెబ్రీయులకు 4:1–

11).

**వచనము 29. మీ మీద నా కాడి ఎత్తికొనుడి** అని ఆయన తన శ్రోతలను ప్రేరేపించాడు. ఒక కాడి, అక్షరాలా అది ఎద్దులను/జంతువులను జతగా కలిపి కట్టియుంచుటకు ఉపయోగింపబడినది, ప్రాచీన ప్రపంచంలో లోబడి యుండుటకు ఒక రూపకాలంకారమై యుండినది (ద్వితీయోపదేశకాండము 28:48; యిర్మీయా 27:1–11; విలాపవాక్యములు 1:14). పౌలు, ధర్మశాస్త్రమును ఒక "కాడి"యని సంబోధించుచున్నాడు (గలతీయులకు 5:1), మరియు పేతురు దానిని "మన పితరులైనను మనమైనను మోయలేని కాడి" అని పిలుచుచున్నాడు (అపొస్తలుల కార్యములు 15:10).[1]

**అటు తరువాత యేసు, నా యొద్ద నేర్చుకొనుడి** అని చెప్పాడు. "నేర్చుకొనుట" అని అనువదింపబడిన గ్రీకు క్రియా పదము (*manthanō*), "శిష్యుడు" (*mathētēs*)అని అనువదింపబడిన నామవాచకముతో బహు సమీప సంబంధము కలిగియున్నది. క్రీస్తు శిష్యులు నేర్చుకొనుచుండువారై యున్నారు; వారు ఆయన యొద్ద నేర్చుకొనవలసినవారై యున్నారు (28:19 చూడు).

అటుతరువాత యేసు తన సొంత స్వభావమును వర్ణించుచు, **ఏలయనగా నేను సాత్వికుడను దీన మనస్సుగలవాడను** అని చెప్పాడు. యేసు యొక్క "సాత్వికమైన" మరియు "దీనమైన" స్వభావము యేసు ఘర్షణపడిన పరిసయ్యుల అహంకారము మరియు వారి అంగరంగ వైభవమునకు వ్యత్యాసముగా నిలుచుచున్నది. ఆయన లేఖనములను నెరవేర్చుచున్నాడని సాధికారపూర్వకంగా చెప్పుచుండినట్లు, యేసు చేసిన ఘోషణ లో యెషయా గ్రంథంలోని శ్రమనొందు సేవకుని ప్రతిధ్వనులు (యెషయా 42:2–4; 53 చూడు) వినిపించుచున్నవి.[2]

"సాత్వికము" (*praus*) అను పదము "సాధుగుణం" KJV అని కూడ అనువదింపబడవచ్చును. ఈ పదము సెప్టువజింట్‌లో దేవుని సేవకుడైన మోషేను వర్ణించుటకు ప్రయోగింపబడినది (సంఖ్యాకాండము 12:3). యేసు క్రీస్తు యెరూషలేము లోనికి విజయోత్సవముతో ప్రవేశించుటను వర్ణించుటకు మత్తయి ఆధారంచేసికొనిన జెకర్యా 9:9ని ఆయన ఉల్లేఖించి వ్రాసిన దానిలో కూడ ఈ పదము చూడనగును: "ఇదిగో, నీ రాజు సాత్వికుడై, ... గాడిదను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడు" (21:5). పౌలు "యేసు క్రీస్తు యొక్క సాత్వికమును మరియు మృదుత్వమును" గూర్చి వ్రాయుచున్నాడు (2 కొరింథీయులకు 10:1). కొండ మీద ప్రసంగములో, ఈ సుగణము కలిగియుండువారిపై యేసు ఒక దీవెనను ప్రకటించాడు (5:5పై గల వ్యాఖ్యానములు చూడు).

అయన ఇంతకు మునుపు పలికిన పలుకులకు పొందికగా, "అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకునని" క్రీస్తు వాగ్దానము చేసాడు. ఇచ్చుట ఇవ్వబడిన వాగ్దానమును వారికిచ్చుచు, ఆయన ప్రజలు "పురాతన మార్గములకు" తిరుగవలెనని, పాత నిబంధనలో దేవుడు తన ప్రజలను అహ్వానించాడు (యిర్మీయా 6:16). ఇచ్చుట ప్రయోగింపబడిన భాష ఆ గ్రంథపాఠములో నుండి తీసికొనబడి యుండును.

**వచనము 30.** యేసు తన ఆహ్వానమును ఒక వాగ్దానముతో ముగించడు. **ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి.** "సుళువు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*chrēstos*) "సరిపడు," "ఆహ్లాదకరమైన," లేక "దయగల" అని కూడ

అనువదింపబడవచ్చును. “సరిగ్గా సరిపోతోంది” అనునది దాని అభిప్రాయమై యున్నట్లు అగుపించుచున్నది. ఎద్దు/జంతువు మెడ మీదకు సరిపడని కాడి పుండు పడునట్లు చేయును మరియు చాలా చిరాకు కలిగించును. యేసు కాడి ప్రతి ఒక్కరికి నిరపాయకరముగాను మరియు సరిగ్గా సరిపడునట్లుగాను కుదురును.

భారమైనవైయున్న యూదా మత బోధకుల సాంప్రదాయములకు తారతమ్యముగా, యేసు ఇచ్చిన నియమములు సామాన్యమైనవి, మరియు ఆచరించుటకు అతి సుళువైనవియునై యున్నవి (1 యోహాను 5:3). లేఖనముల చూట్టూర అభివృద్ధి చేయబడి కఠినమైయున్న సాంప్రదాయములు ఆయన రద్దుచేసి, ధర్మశాస్త్రములోని ప్రధానాంశము మరియు దేవుడు తన ప్రజలతో కలిగియున్న ఒడంబడిక సంబంధము కొరకు గల అభీష్టపరిమాణములు సమకూర్చుటలో అది ప్రయోజనపడు ఉద్దేశముల గూర్చి ఆయన శిష్యులకు మార్గనిర్దశనము నిచ్చాడు. ఆయన ఉపదేశములను వినుచుండిన శ్రోతలందరును ఆయన ప్రతిపాదనను అంగీకరించవలెనని వారిని ఆహ్వానించుచుండెను.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### ఒక ఆహ్వానము (11:28-30)

మనలను ఆహ్వానించుచున్నదెవరు, మరియు మనము ప్రవేశింపవలెనని ఆయన ఆహ్వానించుచున్న అసలు విషయము సరిగ్గా ఏమైయున్నది? మనము ఆయనతో గల సన్నిహితమైన మరియు వ్యక్తిగతమైన సంబంధము లోనికి ప్రవేశింపవలెనని యేసు మనలను ఆహ్వానించుచున్నాడు. “నా యొద్దకు రండి”అంటూ మనలను ఆహ్వానించుచున్నాడు. ఈ ఆహ్వానము చాలా వరకు వ్యక్తిగతమైనదై యున్నను, “సమస్త జనులు” ఆయన యొద్దకు రావచ్చునని ఆయన చెప్పుచున్నాడు. ఆయన ప్రయాసపడుచున్నవారిని మరియు చురుకైనవారుగా తమ పనులలో నిమగ్నమైయున్నవారిని ఆహ్వానించుచున్నాడు. భారము మోసికొనుచున్న వారిని, వారికి తమ జీవితము గొడ్డుచాకిరియై యున్నవారిని ఆయన ఆహ్వానించుచున్నాడు. బహుశా ఒకనికి తన ఉద్యోగము నుండి ఎటువంటి సంతృప్తియైనను లభించకుండవచ్చును. మరొకరి వైవాహిక జీవితము సంతోషభరితమైనది కాకపోవచ్చును. ఒక వృద్ధుని ఆరోగ్యము అంతకంతకు క్షీణించిపోవుచుండవచ్చును, లేక ఒక యౌవన స్త్రీ తన నైతిక విలువల విషయంలో రాజీపడి యుండవచ్చును. యేసు ఇచ్చుచున్న ఆహ్వానము, చావు దెబ్బలు తినుచున్నవారు, బహుగా బాధపడుచున్నవారు, జీవితమే ఒక పెద్ద మోయరాని భారమైయున్న వారందరి కొరకు ఉద్దేశింపబడినదై యున్నది. మనము విశ్రాంతి పొందవలెనని ఆయన మనలను ఆహ్వానించుచున్నాడు. ఈ విశ్రాంతి కేవలం శారీరకమైన తాజాదనము కాదు, కానీ మనము మోయుచున్న ఆధ్యాత్మిక భారముల నుండి కలుగు ఉపశమనమై యున్నది. ఆయన ఎవరై మరియు ఏమైయున్నాడని దానినిబట్టి ఆయన మీద మోపు భారము “సుళువైనదై” యున్నది. ఆయన “సాత్వికుడును, దీనమనస్సుగలవాడునై” యున్నాడు.

### మనము మోయుచున్న భారములు (11:28-30)

మనము ఈ జీవిత యాత్రలో మనతో కూడ అనేక భారములను మోయుచుందుము. మనకు గతములో ఎదురైన విచారములు, ప్రస్తుతము గూర్చిన ఆందోళనలు, మరియు భవిష్యత్తుకు సంబంధించిన చింతలు కలవు. మన జీవితములు ఒత్తిడులమయమైపోవచ్చును. మన భారములను మనము తేలిక చేసికొనుటకు దేవుడు మనకు రెండు మార్గములను ఇచ్చాడు. మొదటిది, వీటన్నిటిని ఆయన మీద వేయవచ్చును (1 పేతురు 5:7; కీర్తనలు 55:22 చూడు). రెండవది, మనము ఒక రోజులో నిర్వహించగలిగిన పనులను మించి మన మనస్సులను ఇతరమైనవాటిపై యిక ఏ మాత్రమును కేంద్రీకరించి నిలుపకుండునట్లు మనము చైతన్యవంతులమై ప్రయాసపడవచ్చును (మత్తయి 6:34).

---

సూచనలు

[1]Sirach 51:26; Mishnah *Aboth* 3.5; *Berakoth* 2.2 చూడు [2]Donald A. Hagner, *Matthew 1-13*, Word Biblical Commentary, vol. 33A (Dallas: Word Books, 1993), 324 చూడు.